
భర్తృహరి
సుభాషిత త్రిశతి
( సరళ వచనానువాదం )
అనువాదం
అవధాన కళానిధి
ఆముదాల మురళి

# భర్తృహరి సుభాషిత త్రిశతి

( సరళ వచనానువాదం )

© హక్కులు రచయితవి

ప్రథమ ముద్రణ :
ప్రపంచ తెలుగు మహాసభలు
డిసెంబరు 2012

ప్రతులు : 1000
ధర : రూ. 90/-

ప్రతులకు
**ఆముదాల విజయకుమారి**
9-65, యస్.బి.ఐ. కాలని
ఎ.కె. పల్లి (పోస్ట్)
రేణిగుంట రోడ్డు
తిరుపతి-517 507
ఫోన్ : 94404 32683

డి.టి.పి. : చంద్ర, 98493 14956
ముద్రణ : విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లి.

# అభినందన

సంస్కృత వాఙ్మయంలో భర్తృహరి సుభాషితాలకి ఒక ప్రత్యేకత ఉంది. ఆ విషయం చాలామంది సాహితీవేత్తలకి తెలుసు. తెలియని తెలుగు సాహిత్యవేత్తల గురించి మనకనవసరం. అయితే ఈ భర్తృహరి శతక సాహిత్యాన్ని చాలామంది తెలుగు కవులు పద్యరూపాల్లో అనువదించారు. అలా అనువదించిన వారిలో ఏనుగు లక్ష్మణకవి ప్రముఖులు.

భర్తృహరి శతక శ్లోకాలుగాని, ఏనుగు లక్ష్మణకవి పద్యాలు గాని పామరులకి అర్థంకావడం కొంత కష్టమని నా వ్యక్తిగత అభిప్రాయం. అందుకనే సులభమైన తెలుగువచనంలోనికి ఈ 'అమూల్యసంపదను' అందరికి అర్థమయ్యేటట్లు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనకు ప్రయత్నరూపమే "ఆముదాల మురళి చేత ఆశ అభినవ మాసపత్రిక కోసం రాయించేట్లు" చేసింది. ఆ ప్రయత్నం అందరికి ఆమోదయోగ్యమైంది. అందరి అభినందనలూ అందుకొనింది.

ఎందరో మహానుభావుల అనుభవాలు, మానవ స్వభావాలు, విలక్షణ లక్షణాలు, ఖచ్చితంగా, నిర్దిష్టంగా ఇందులో చెప్పటం జరిగింది. కనుక ఇది ఏ భాషా ప్రాంతాల వారికైనా, ఏ భవిష్యత్ తరాల వారికైనా ఎంతగానో ఉపయోగపడుతుంది. మురళికి ఓపిక ఉంటే... భవిష్యత్తులో ఇంగ్లీషులోకి అనువదిస్తే... మరింత ప్రయోజనం ఉంటుంది.

భర్తృహరి శ్లోకాల్ని, లక్ష్మణకవి పద్యాల్ని, తెలుగు వచనాన్ని ముచ్చటగా ఒకే పుస్తకరూపంలో అందించిన ఆత్మీయుడు ఆముదాల మురళికి అభినందనలు.

**కె. వేణుగోపాల్**

9849496111

# ఇది ఒక ప్రేరణఫలితం

నా జీవనం దుర్భరంగా ఉన్న దినాల్లో పరిచయమైన వ్యక్తి శ్రీ కె. వేణుగోపాల్ గారు. అప్పుడు వారు నాయుని కృష్ణమూర్తిగారు స్థాపించిన చిత్తూరు విజయవాణి విద్యాసంస్థలకు అధ్యక్షులు. శ్రీశ్రీ, చలం, కొ.కు. వారి మాటల్లో నిరంతరం తారసపడేవారు. సుప్రసిద్ధ వక్తలను పిలిపించి సాధికార, ప్రామాణిక సాహిత్య సమావేశాలను నిర్వహించేవారు.

ఆ క్రమంలో ఓసారి 'చలం' సాహిత్యసభ. సభాధ్యక్షులు సి.వేణు (నవ్విన ధాన్యరాశి). ప్రధానవక్త కుప్పిలిపద్మ. నేను, నక్కలప్రభాకర్‌రెడ్డి సమావేశానికి వెళ్ళాం. కుప్పిలి పద్మ ఉపన్యాసం ముగిసిన పిమ్మట అధ్యక్షులు శ్రోతల్లోనుంచి ఎవరైనా మాట్లాడవచ్చున్నారు. నేను ప్రారంభించాను. నిమిషమైనా కాకముందే వారు నన్ను ఆపమన్నారు. నేను ఆపి కూర్చొన్నాను. సభ ముగిసింది. ప్రభాకర్‌కు కోపం వచ్చింది. నాకోసం అధ్యక్షుల్ని నిలదీశాడు. అప్పుడు నావయసు పంతొమ్మిది, ప్రభాకర్‌కు పద్దెనిమిది. నిండా ఇరవైయేళ్ళు కూడా రాని మా ఆవేశాన్ని శాంతపరచిన వ్యక్తి శ్రీ కె. వేణుగోపాల్.

ప్రభాకర్ కథలు, కవితలు, నవలలు, పత్రికారంగం, విద్యార్థిసంఘాలు, ట్యూషన్లు, పోరాటం దాటి ఇప్పుడు గ్రూప్-1 ఆఫీసర్.

ప్రతిరోజు సాయంకాలం ప్రభుత్వ ఐ.టి.ఐ నుండి సుమారు మూడు కిలో మీటర్లు నడిచి వేణుగోపాల్ గారి దగ్గరకు చేరుకొనే వాడిని. బజ్జీలు, టీలు మామూలే. కొందరు అందుకే వస్తాడని కూడా అన్నారు. మాలోకం మాది. అప్పుడప్పుడు నాయుని కృష్ణమూర్తిగారు కనిపించేవారు, గంభీరమూర్తి. దూరం నుంచి బెరుకు బెరుగ్గా చూసేవాణ్ణి. వారికి వేణు సార్ నన్ను పరిచయం చేశారు. అప్పటివరకు అడపాదడపా పద్యాలు, వచనకవిత్వం వ్రాసేవాణ్ణి, వేణుసార్ నా నోటు పుస్తకం చూశారు. కొడవటిగంటి, సినారే, శ్రీశ్రీ, చలం పుస్తకాలిచ్చారు. చదివించారు. చర్చించారు. కథలు వ్రాయమన్నారు. అలా మొదట వచనంలోకి అడుగుపెట్టాను.

ప్రతి సాయంకాలం కథల గురించి కబుర్లే. నన్ను, నా కథల్ని, పులికంటి కృష్ణారెడ్డికి, రేడియోకు, చిత్తూరు జిల్లా రచయితల సంఘానికి పరిచయం చేశారు.

కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారస్థాపనలో వేణుసార్ కీలకపాత్ర పోషించారు. డా॥ రామలక్ష్మిగారు ఆ బాధ్యతను రచయితల సంఘానికి అప్పజెప్పారు. 1995 జూన్ 12న ఆ పురస్కార సభల్లో నాకు జీవితంలో మొట్టమొదటి సన్మానం జరిగింది.

సర్వశ్రీ ముంగర శంకర్రాజు, సి.వేణు, యం.ఆర్.చంద్ర, కాణిపాకం లింగన్న, మునిశ్రీ, ఇరువారం లోకనాథం, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, కె. రామకృష్ణ, పిచ్చాండి, బి.మునస్వామి, సింగార సుబ్బరాయుడు, సుబ్బరాఘవరాజు, యం.ఆర్. అరుణ, మాణిక్యవీణ, హరికృష్ణ, విజయకుమార్ ఇలా చాలామంది కవులు, రచయితలతో పరిచయం ఏర్పడింది. గురుప్రసాద్, ప్రకాష్ నాకు వేణుసార్ ద్వారా పరిచయమైన ఆత్మీయ స్నేహితులు.

ఆర్ట్ లవర్స్ యూనియన్ జయరాం గారు మధురాంతకం రాజారాం గారన్నట్లు ఒక ప్రొద్దు చాలని మనిషి. ఎప్పుడూ నాటకాలే. వారి క్రమశిక్షణా బద్ధమైన దర్శకత్వంలో 'ఏసుజీవితం' సౌండ్ & లైట్ నాటకం ఏడు స్టేజీలమీద, చిత్తూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగింది. అందులో వేణుసార్ ఏసుక్రీస్తు, నేను దేవదూతగా నటించాము.

నటనపై మక్కువ వేణుసార్‌ను హైదరాబాద్‌కు పంపించింది. వారికి దగ్గరగా మెలిగిన రెండేళ్ళలో పాతిక కథలు వ్రాసిన నేను ఆపై దాదాపు ఏడుసంవత్సరాలు కథ వ్రాయలేకపోయాను. వారు అంతటి ప్రభావవంతమైన వ్యక్తి. ఆ రోజుల్లోనే మేడసాని మోహన్ గారి సహస్రావధానంలో పాల్గొనే అవకాశం వేణుసారే కల్పించారు. తరువాత కాలంలో నేను తెలుగు విశ్వవిద్యాలయంలో, చిక్కడపల్లి లైబ్రరీల్లో అవధానం చేసినప్పుడు వచ్చి, చూసి, సంతోషించి ఆశీర్వదించారు.

నాకు దొండకాయ వేపుడంటే చాలా ఇష్టం. నేను హైదరాబాద్ వెళ్ళినప్పుడల్లా పద్మజా మేడం (వేణుగోపాల్ గారి భార్య) గారు, దొండకాయ వేపుడు చేస్తారు. వారిది అనురూపమైన అపురూప దాంపత్యం. వారికి నాపైనున్న వాత్సల్యం నిరుపమానం.

బోధనా రంగానికి స్వస్తి జెప్పి, సినిమారంగంలో ప్రవేశించిన వేణుగోపాల్ గారికి బెంగుళూరుకు చెందిన నిర్మాత వేంకటేశులు గారితో పరిచయం ఏర్పడింది. ఒక మాసపత్రిక నడపాలన్న సంకల్పంలో వాళ్ళిద్దరూ మరింత దగ్గరైనారు. పని ప్రారంభమైంది. అవధానరంగంలో బుడిబుడి నడకలు నడుస్తున్న నన్ను పిలిచి భర్తృహరి సుభాషితాలను వచనానువాదం చేయమన్నారు. సరళంగా, చందమామ భాషలో ఉండాలన్నారు. ఆ ప్రేరణకు ఇది ఫలితం.

నెలకు ఇరవై శ్లోకాల చొప్పున పదహారు నెలలు వ్రాశాను. మంచి బొమ్మలతో ప్రచురించారు. ఈ జ్ఞాపకాలన్నీ పదిలంగా ఉండాలని ఈ పుస్తక ప్రచురణకు పూనుకొన్నాను.

నన్నయకు రాజరాజనరేంద్రుడులా నాకు మాసి కృష్ణమూర్తిగారు నిత్యం అండదండగా ఉంటారు. వారి చలువ వల్లనే నా స్వర్ణతుషారం వెలుగుచూసింది.

వారికి గురువుగారు మహర్షి కృష్ణానందగారు నీతిశతకం అనువాదంలో కొంతభాగం విని ముద్రణ వ్యయం భరిస్తామని హామీ ఇచ్చి ఆశీర్వదించారు.

'ఆశ' మాసపత్రికలో ఈ అనువాదం ప్రచురించిన పబ్లిషర్ శ్రీవేంకటేశులు గారికి, ఎడిటర్ కె. వేణుగోపాల్ గారికి, ముద్రణ ద్రవ్యదాతలైన శ్రీశ్రీశ్రీ మహర్షి కృష్ణానందగారికి, శ్రీమాసి కృష్ణమూర్తి, శ్రీమతి కత్తి మమత దంపతులకు, డి.టి.పి. చేసిన చంద్రగారికి, ముద్రణ చేసిన విజయవాణి ప్రెస్ వారికి కృతజ్ఞతలు తెలుపు కొంటున్నాను.

## అనువాద పద్ధతి

అనువదించిన నేపథ్యం ఏదైనప్పటికి పాఠకులకు మనవి చేసుకోవాల్సిన ప్రధానవిషయం అనువాదపద్ధతి. ఈ అనువాదానికి ముందుగా భర్తృహరి పూర్వజీవితానికి సంబంధించిన కథ వ్రాశాను. రకరకాల కథలు లోకంలో ఉన్నాయి, అందులో ఒక ఆసక్తికరమైన కథను నేను పేర్కొన్నాను. దీనివెనుక ఎలాంటి చారిత్రక ఆధారాలూ లేవు. పాఠకులకు ఆసక్తిని కలిగించడమే పరమప్రయోజనం.

భర్తృహరి సుభాషితాలకు దక్షిణాత్య, ఉదీచ్యప్రతులు లభ్యమౌతున్నాయి. నేను దాక్షిణాత్యప్రతిని అనుసరించాను. రామచంద్ర బుధేంద్రుని సంస్కృతవ్యాఖ్యను ఉపయోగించుకొన్నాను. కొన్నిప్రతుల్లో అధికపాఠాలున్నాయి. వాటిలో చాలా మట్టుకు భాషాఛందస్సుల్లో భిన్నమైనవే తప్ప భావంలో భిన్నమైనవి కావు. పునరుక్తి ఎందుకు లెమ్మని వాటిని వదిలేశాను.

వ్యాఖ్యానంలో తెలుగువారందరికి మల్లినాథసూరి మహోపాధ్యాయుడని నేను నమ్ముతాను. పారిభాషిక పదాలు వివరిస్తే నాస్వోపజ్ఞ పెరుగుతుందని యథాతథంగా వ్రాశాను. భావం సుగమమేనని నా భావన. చివరకు నిర్ణేతలు పాఠకులే.

పాఠాంతరాలు ఉన్నచోట సరసమైన, సరళమైన పాఠాన్ని ఎన్నుకొన్నాను. ఏది సరళమైనది, ఏదిసరసమైనదన్న ప్రశ్నకు నా బుద్ధియే నిశ్చయాత్మకము. అనుబంధం భారమే కాని అసమగ్రం కాకూడదన్న ఆకాంక్షవల్ల సాహసం చేశాను. సంస్కృత శ్లోకాలలో పూర్ణబిందు పూర్వక వర్గాక్షరాలను, అనునాసికాలతో సంయుక్తం చేసి వ్రాసే నియమాన్ని సాధ్యమైనంత వరకు పాటించాను. తెలుగు ఒరవడి కారణంచేత ఎక్కడైనా తప్పిపోయి ఉంటే పండితులు మన్నించగలరు. నేను పాఠాంతరాలిచ్చే పనికి పూనుకోవడం లేదు. అందుకు కూడా మన్నించగలరు.

విజయదశమి-2012 **– ఆముదాల మురళి**

# కృష్ణానందం భజామ్యహమ్

ఉ. పుట్టికి వేయి పుట్లు పెనుపొందును చేసిన దానమంచు, తా
గట్టిగ నమ్మి, శిష్యులను కర్ణ, దధీచి, శిబిప్రకాండులన్
నెట్టెడు రీతి దానగుణ నిష్ఠులు గా నొనరించి సేవకున్
పట్టముఁగట్టు కృష్ణఋషి మాన్యుని మార్గము నెన్నగావలెన్

ఉ. ఆకలిప్రాణధర్మ మఖిలంబగు జీవులకెల్ల; అన్నపూ
ర్ణాకృతి దాల్చి శాంకరి చరాచర జీవ బుభుక్ష శాంతికై
వాకిట శాకపాకముల వండుచు వడ్డన చేయుచుండి, వే
స్వీకృతిఁజేయ రమ్మనుచుఁజీరును భక్తుల ప్రేమతోడుతన్

ఆ.వె. అట్టి అన్నపూర్ణ నారాధనముఁ జేసి
గోపురములుఁ గట్టి గుడులు గట్టి
స్థిరనివాసమందు తిరుపతిలో నిల్పి
అన్నదాన యజ్ఞమాచరించు

సీ॥ పండి రాలెదు ఆకు గుండె కన్నీటిని కరుణతో తుడిచిన కరములవ్వి
దిక్కెవ్వరును లేని దీనజనంబుల కాసరాయైనట్టి హస్తములవి
నిత్యాన్నదానంబు నిష్ఠతో జరిపించు శ్రేష్ఠకృత్యంబుల చేతులవ్వి
అన్నపూర్ణాదేవి కాలయంబైనట్టి సంకల్ప బలముకు సాక్ష్యమవ్వి

తే.గీ. ఆ మహర్షి కృష్ణానంద హస్తయుగ్మ
మభయ హస్తమై ముద్రణ వ్యయమునొసగ
అచ్చులోఁ జూచు కొందు నా అక్షరముల
వారి ఆశీస్సులకు నిది ఫలమటంచు

శా॥ స్వామీ! మీ కరుణార్ద్ర వర్షమున ఆపాదోత్తమాంగంబు గా
భూమానందకరంబుగా తడిసి నా పొత్తంబు లోకంబులో
క్షేమంబై వెలుగొందు భాగ్యమును, ఆశీర్వాదమున్ గొంటి, మీ
సామీప్యంబు సమస్త దుఃఖహరమౌ స్వర్గంబుగాఁ గొల్చెదన్

# విషయ సూచిక


1. అభినందన ........................................................ 3
2. ఇది ఒక ప్రేరణ ఫలితం ........................................... 4
3. కృష్ణానందం భజామ్యహం ........................................... 7
4. నీతిశతకం ........................................................ 9
5. శృంగార శతకం ................................................... 41
6. వైరాగ్య శతకం ................................................... 69
7. అనుబంధం – I (భర్తృహరి శ్లోకాలు) ................................ 87
   అ) నీతిశతకం ................................................... 87
   ఆ) శృంగార శతకం ............................................... 102
   ఇ) వైరాగ్య శతకం ............................................... 116
8. అనుబంధం– II (ఏనుగు లక్ష్మణకవి పద్యాలు) ........................ 133
   అ) నీతిశతకం ................................................... 133
   ఆ) శృంగార శతకం ............................................... 150
   ఇ) వైరాగ్య శతకం ............................................... 166

# నీతి శతకము

## భర్తృహరి

చాలారోజుల క్రితం అంటే సుమారు 2 వేల సంవత్సరాలకు ముందుమాట నందీపురం అనే గ్రామం ఉండేది. ఆవూళ్లో చంద్రవర్ణుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి చదువంటే చాలా ఇష్టం. ఆరోజుల్లో ఉన్న చదువుల్లో చాలా వాటిని చదువుకొన్నాడు. ఎంత చదివినా అతనికి చదువుపట్ల ఆసక్తి తగ్గలేదు. రోజు రోజుకు చదువుకోవాలనే కోరిక పెరుగుతూనే ఉంది. చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న గురువుల్నందర్నీ కలిసి వారికి తెలిసిన విద్యలన్నీ నేర్చుకొన్నాడు. ఇంకా నేర్చుకోవాలనిపించింది. మంచి గురువుకోసం వెదుకుతూ బయలుదేరాడు.

చాలామంది గొప్ప గొప్ప గురువులుగా పేరుపొందిన వారిని కలుసు కొన్నాడు. కానీ, ఏంలాభం? వారికంటే చంద్రవర్ణునికే ఎక్కువ తెలుసు. అలా తిరిగి తిరిగి చివరకు నిరాశతో మళ్ళీ తిరుగుప్రయాణం మొదలు పెట్టాడు.

అనేక వాగులు, వంకలు, గ్రామాలు దాటుకొంటూ, ఆయా ప్రాంతాల్లో బాగా చదువుకొన్న వారెవరైనా ఉన్నారేమోనని విచారిస్తూ వస్తున్నాడు. ఇంతలో ఒక అరణ్యమార్గం ఎదురైంది. ఒంటరిగా అడవిగుండా నడక మొదలుపెట్టాడు. ఎంతదూరం నడిస్తే తరువాత గ్రామం వస్తుందో, అడవి పూర్తవుతుందో తెలియదు. వెళ్ళేకొద్దీ అడవి చిక్కనవుతూ ఉంది. దూరం నుంచి క్రూరమృగాల అరుపులు కూడా వినిపిస్తూ ఉన్నాయి.

అడవి ఎంత భయంకరంగా ఉందో, అంతే అందంగా కూడా ఉంది. సీతాకోకచిలుకలు, రకరకాల పక్షులు, మొక్కలు, వృక్షాలు, రంగురంగుల పుష్పాలు, పొదలు తీగలు, సెలయేర్లు, అప్పుడప్పుడు ఎదురుపడి చాటుకు గెంతే కుందేళ్ళు, లేళ్ళు వీటన్నిటిని చూస్తూ చంద్రవర్ణుడు చాలా ఆశ్చర్యపోయాడు.

అడవి అందాలను చూస్తూ చాలాదూరమే నడిచాడు. అయితే అది వేసవికాలం. కాస్తా పొద్దెక్కే సరికే అతను అలసిపోయాడు. దప్పిక వేస్తూ ఉంది. ఆకలి కూడా మొదలైనట్లుంది. ఎక్కడైనా విశ్రాంతి తీసుకొంటే బాగుంటుందని అనుకొన్నాడు.

అల్లంతదూరంలో ఒకపెద్ద రావిచెట్టు కనిపించింది. అక్కడికెళ్ళి విశ్రాంతి తీసుకోవాలనుకొన్నాడు. ఆ ప్రాంతం చాలా సుందరంగా ఉంది. సమీపంలో ఒక కొలను కూడా ఉంది. అవన్నీ చూసి చంద్రవర్ణుడు ఆనందించాడు. తియ్యగా ఉన్న ఆ కొలను నీటిని కడుపునిండా త్రాగి, రావిచెట్టు నీడలో పడుకున్నాడు. అతనికి బాగా నిద్రపట్టింది.

చాలా సేపటి తర్వాత ఉన్నట్టుండి మేల్కొన్న చంద్రవర్ణుడు తనముందు ఒక బ్రాహ్మణుడుండటం చూశాడు. అతనొక గంధర్వుడు. శాపంవల్ల బ్రహ్మ రాక్షసుడుగా భూలోకంలో పుట్టాడు. ఇప్పుడు బ్రాహ్మణవేషంలో చంద్రవర్ణుని ముందుకు వచ్చాడు. ఈ విషయాలేవి తెలియని చంద్రవర్ణుడు "ఈ అరణ్యంలో కన్పించిన ఇతడెవరబ్బా" – అని ఆలోచిస్తున్నాడు.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు చంద్రవర్ణున్ని పలుకరించి, అతని వివరాలడిగాడు. చంద్రవర్ణుడు చదువుకోవాలనే తనకోరికను ఆ బ్రాహ్మణునికి తెలిపి అంతవరకు జరిగిన విషయాలన్నీ చెప్పాడు. ఆ బ్రాహ్మణుడు "నేను నిన్ను ఆరునెలల్లో సర్వజ్ఞుణ్ణి చేస్తాను" అని చెప్పి, ఆ ఆరునెలలు ఆకలి, దప్పిక లేకుండా ఉండేందుకు ఒక మూలికను ఇచ్చాడు. దాన్ని తిన్న చంద్రవర్ణునికి ఆకలి, దప్పిక మాయమై పోయాయి. మరుసటిరోజు నుండి ఆ బ్రాహ్మణుడు ప్రతిరోజూ ఒకే సమయానికి అక్కడున్న రావిచెట్టులో నుంచి ఒక ఆకును త్రుంచి దానిపై ఆరోజు చదవాల్సిన పాఠాన్ని వ్రాసిచ్చేవాడు. చంద్రవర్ణుడు ఆ పాఠాన్ని మరుసటి రోజు అతను వచ్చే వరకూ పదే పదే చదువుకొంటూ ఉండేవాడు.

ఇలా రోజులు గడుస్తున్నాయి. చంద్రవర్ణునికి ఆకలిలేదు, దప్పిక లేదు. నిరంతరం చదువుకొంటున్నాడు. ఆరునెలలు గడిచాయి. చంద్రవర్ణునికి అన్ని విద్యలు వచ్చాయి. చంద్రవర్ణుని చదువు దాహం తీరింది. ఒకరోజు ఆ బ్రాహ్మణుడు వచ్చి "చంద్రవర్ణా! నేటితో నీ చదువు పూర్తైంది. నీవు సర్వజ్ఞుడవైనావు" అని అన్నాడు. చంద్రవర్ణునితో తన కథను చెప్పిన వెంటనే అతని గంధర్వరూపం

అతనికి వచ్చింది. చదువుపట్ల అపారశ్రద్ధచూపిన చంద్రవర్ణుని దీవించి ఆ గంధర్వుడు మాయమయ్యాడు.

ఆరునెలలపాటు ఆకలిదప్పికలు లేవు కాబట్టి చంద్రవర్ణుడు ఆహారం, నీళ్ళు తీసుకోలేదు. గంధర్వుడు వెళ్ళిపోగానే మూలిక ప్రభావం కూడా పోయింది. చంద్రవర్ణునికి ఆకలి మొదలైంది. ఆరునెలల క్రితం తాను నీళ్ళు త్రాగిన కొలనులో నీళ్ళు త్రాగి బయలుదేరాడు. అతని గ్రామమైన నందిపురానికి వెళ్ళాలంటే కన్యాకుబ్జ నగరాన్ని దాటివెళ్ళాలి. ఎలాగైనా కన్యాకుబ్జం చేరుకొంటే ఆహారం దొరుకుతుందని నడక ప్రారంభించాడు.

ఆరునెలలుగా తినని కారణం చేత అతని శరీరంలో శక్తిలేదు. కండలు కరిగిపోయాయి. ఎముకలగూడుకు చర్మాన్ని కప్పినట్లు ఉన్నాడు. నాలుగడుగులు కూడా వేయలేని పరిస్థితిలో ఉన్నాడు. అడవిలో దొరికే ఆకులలములు తింటూ, చెట్లక్రింద పండి రాలిన పండ్లను తింటూ చాలాపట్టుదలతో అడవిని దాటాడు. కొంతదూరంలో ఎత్తైన భవనాలు కన్పించాయి. సవారి చేస్తున్న గుఱ్ఱపుడెక్కల శబ్దం వినిపించింది. దట్టంగా ఉన్న చెట్లలో నుంచి పైకివస్తున్న పొగ కన్పించింది. కన్యాకుబ్జాన్ని సమీపించామనే ఉత్సాహంతో నడిచి నగరశివార్లకు చేరుకొన్నాడు. ఇంతలో చీకటైంది.

ఒక ఇంటిముందు కన్పించిన అరుగుపై అలసటతో కూర్చున్న చంద్రవర్ణుడు మెల్లమెల్లగా ప్రక్కకు వాలిపోయి స్పృహకోల్పోయాడు.

ఆ ఇల్లు ధనవతి అనే వేశ్యది. ఆమెపేరుకు తగినట్టు బాగా డబ్బు సంపాదించింది. తన అందంతో చాలామంది మగవారిని ఆకర్షించింది. వాళ్ళంతా ఇప్పుడు భిక్షపతులు, ఆమె మాత్రం ధనవతి. ధనవతికి వయసు మీరుతున్నది. ఒకప్పటి లాగా ఇప్పుడు విటులను ఆకర్షించలేకుండా పోతున్నది. అందుకే తన కుమార్తెయైన అలంకారవతిని వృత్తిలోకి దించాలని ఆలోచిస్తూ ఉన్నది.

అలంకారవతి మంచి అందగత్తె, బాగా చదువుకొన్నది. సంగీతం తెలుసు నాట్యం నేర్చుకొన్నది. కాని, తల్లివలే వేశ్యగా బ్రతకటం ఆమెకు ఇష్టం లేదు. తన రూపానికి చదువుకు తగిన ఒక యువకుణ్ణి చూసి పెళ్ళిచేసుకోవాలని కలలు కంటూ ఉంది. అందుకే తల్లి ఎంత గొప్ప విటుణ్ణి తీసుకొని వచ్చినా ఏదో

ఒకమాట చెప్పి వెనక్కి పంపేస్తూ ఉంది. అయితే తన కోరికను తల్లితో చెబితే ఏమంటుందో నన్న భయంతో కాలం గడుపుతూ ఉంది.

అలంకారవతి ఆరోజు తమ వీధి అరుగుమీద ఎవరో పడుకొని ఉండటం చూసింది. పలుకరించింది. అతను ఉలకలేదు, పలుకలేదు, చెలికత్తెల్ని పిలిచింది. దీపం వెలుతుర్లో అతని ముఖాన్ని చూసింది. నీరసంగా వాడిపోయిన ఆముఖంలో యవ్వనం ఎక్కడో కనిపించింది. ఎముకల గూడులా ఉన్న అతన్ని అలంకారవతి తనగదిలోకి చేర్పించింది. రాత్రికి రాత్రే మంచివైద్యుణ్ణి పిలిపించింది. అతడు స్పృహలేని చంద్రవర్ణుణ్ణి పరీక్షించాడు. చాలారోజులు తిండినీళ్ళు లేనికారణంగా ఏర్పడిన బలహీనత వల్ల అతనలా ఉన్నాడని, అతని వయసు పాతికేళ్ళ లోపే ఉంటుందని వైద్యుడు చెప్పాడు.

అలంకారవతి ఆశ్చర్యపోయింది. పాతికేళ్ళ యువకుడు తిండి నీళ్ళు లేక అస్థిపంజరంగా తయారుకావడం వెనుక కారణం ఆమెకు అంతుచిక్కలేదు. ఎలాగైనా అతణ్ణి బ్రతికించమని వైద్యుణ్ణి ప్రాధేయపడింది. వైద్యుడు కొన్ని మూలికలనిచ్చి వాటిని రంగరించి కొబ్బరినీళ్ళతో కలిపి త్రాగించమన్నాడు. ఒకానొక సువాసనా భరితమైన తైలాన్నిచ్చి శరీరమంతా మర్దనచేయమన్నాడు.

అలంకారవతి చాలా శ్రద్ధతో ప్రతిరోజూ చంద్రవర్ణునికి వైద్యం చేస్తూ ఉంది. రెండురోజులు గడిచేసరికి చంద్రవర్ణుడు మాట్లాడసాగాడు. తను ఎక్కడ ఉన్నాడో తెలుసుకొని ఆశ్చర్యపోయాడు. కాని పైకి లేవడానికి శరీరం సహకరించడం లేదు. మూలికల రసాన్ని తీసుకొంటూ, అతిలోక సుందరియైన అలంకారవతి మృదువుగా చేసే మర్దనతో అతని శరీరం మామూలు స్థితికి రావడం ప్రారంభించింది. అలంకారవతి ప్రశ్నలన్నింటికీ చంద్రవర్ణుడు సమాధానం చెప్పాడు. మంచి చదువరి, సంస్కారి అయిన చంద్రవర్ణుడు గ్రహణం విడిచిన చంద్రుడులా సంపూర్ణ ఆరోగ్య వంతుడయ్యాడు.

అలంకారవతి నిరంతరం అతనితో మాట్లాడాలని కోరుకునేది. అతని ఎదురుగా కూర్చొని అనేక విషయాలు వింటూ కాలాన్ని మర్చిపోయేది. అతనికి కూడా అలంకారవతిపై ఇష్టం కలిగింది. వారిద్దరూ అలా కొంతకాలం గడిపారు.

ఒకనాడు చంద్రవర్ణుడు తనగ్రామానికి వెళ్తానని బయలుదేరాడు. అలంకారవతి 'నీవంటివానికోసం నేను ఇన్నినాళ్ళు ఎదురుచూశాను, నన్ను పెళ్ళిచేసుకో' అన్నది. చంద్రవర్ణునికి అలంకారవతి అంటే ఇష్టం ఉన్నప్పటికి తనకులం జ్ఞప్తికి వచ్చింది. "నేను బ్రాహ్మణున్ని నీవు శూద్రకన్యవు, నిన్ను నేను పెళ్ళాడకూడదు గదా!" అన్నాడు. ఆమెకు అతడొక చదువుకున్న మొద్దులా కన్పించాడు. ఒక కన్య సిగ్గువిడచి సేవచేసినపుడు అతనికి కులమెందుకు గుర్తు రాలేదో తనచేత గోరు ముద్దలు తిన్నప్పుడు అతనికి కులమెందుకు గుర్తురాలేదోనని ఆమెకు కోపం వచ్చింది. అతన్ని నిలదీసింది. తనను పెళ్ళిచేసుకోవాల్సిందేనన్నది. అతడు ససేమిరా, చేసుకోనన్నాడు.

కన్యాకుబ్జాన్ని మహేంద్రవర్మ అనే రాజు పాలిస్తున్న రోజులవి. అలంకారవతి తల్లి ధనవతి ఇదేసమయమనుకొని కూతుర్ని వృత్తిలోకి దించాలని చూసింది. అలంకారవతి లొంగలేదు. చంద్రవర్ణున్ని రాజుగారిదగ్గరకి తీసుకెళ్ళి అతనిపై ఫిర్యాదు చేసింది. చంద్రవర్ణుడు "నాకు అలంకారవతి అంటే ఇష్టమే కాని, ఆమె శూద్రకన్య కనుక నేను పెండ్లి చేసుకోరాదు కదా!" అన్నాడు. మహేంద్ర వర్మ ఆలోచనలో పడ్డాడు. రాజుగారికి ఆమె ప్రేమనచ్చింది, అతని నిబద్ధత నచ్చింది. పండితుల్ని పిలిపించాడు. సమస్యను పరిష్కరించమన్నాడు.

వారు శాస్త్రాలన్నీ తిరగదోడి ఒక సూచన చేశారు. బ్రాహ్మణుడు మొదట బ్రాహ్మణ కన్యను పెండ్లాడిన పిమ్మట ఎవరిని పెండ్లాడినా దోషం కాదన్నారు. చంద్రవర్ణుని రూపలావణ్యాలు, విద్యాబుద్ధులు చూసి అదేసభలో ఉన్న గుణశర్మ అనే బ్రాహ్మణుడు తన ఏకైక కుమార్తెయైన కళ్యాణిని చంద్రవర్ణునికి ఇచ్చి వివాహం చేస్తానన్నాడు. రాజు మహేంద్రవర్మ తన ఏకైక కుమార్తె మిత్రరేఖను, ఆ సభలోనే ఉన్న ఒక వైశ్యప్రముఖుడు తన ఏకైక కుమార్తెయైన కోమలాంగిని చంద్రవర్ణునికిచ్చి వివాహం చేయాలనుకొన్నారు.

ఒక మంచి ముహూర్తంలో చంద్రవర్ణుడు నాలుగు వర్ణాలనుంచి నలుగురు కన్యలను పెండ్లాడాడు. వారితో ఆనందంగా కాలం గడుపుతూ ఉన్నాడు. మహేంద్ర వర్మకు వారసులు లేనికారణంగా చంద్రవర్ణుణ్ణి రాజును చేశాడు. మిగిలిన బ్రాహ్మణ,

వైశ్య, శూద్ర కన్యల సంపదలు కూడా చంద్రవర్ణునికే చెందాయి అలా ఏ కొరత లేకుండా సుఖంగా రాజ్యపాలన చేస్తూ ఉన్నాడు.

ధర్మబద్ధంగా చంద్రవర్ణుడు రాజ్యపాలన చేస్తున్నాడు. అతనికి బ్రాహ్మణ స్త్రీయందు 'వరరుచి' అనే కుమారుడు జన్మించాడు. అతడు తర్వాతికాలంలో పాణిని వ్రాసిన సంస్కృత వ్యాకరణ గ్రంథమైన అష్టాధ్యాయికి వార్తికాలు వ్రాశాడు. రాజకన్యకయైన మిత్రరేఖకు విక్రమార్కుడు, వైశ్యపుత్రికయైన కోమలాంగి యందు భట్టి, శూద్రస్త్రీయైన అలంకారవతికి భర్తృహరి జన్మించారు.

చంద్రవర్ణుడు వారికి విద్యాబుద్ధులు చెప్పించాడు. రాజులు నేర్చుకోవాల్సిన యుద్ధ విద్యలు, గుఱ్ఱపు స్వారి మొదలగు విద్యలందు పిల్లలు నైపుణ్యాన్ని పొందారు. చంద్రవర్ణుడు, విద్యావంతులు, యవ్వనవంతులైన తనకుమారులను చూసి ఎంతో సంతోషించాడు.

చాలాకాలం రాజ్యపాలన చేసిన తర్వాత చంద్రవర్ణుడు తన నలుగురు కుమారులను పిలిపించాడు. "నాకు వయసైపోయింది. ఇంక రాజ్యపాలన చేయ లేను. మీరు రాజ్యభారాన్ని వహించండి. న్యాయంగా అలంకారవతి నాకు పెద్ద భార్య, ఆమెవల్లనే మిగిలిన వారిని వివాహమాడితిని కాబట్టి భర్తృహరిని రాజును చేయాలను కొంటున్నాను" అన్నాడు.

కుమారులందరూ అంగీకరించారు. ఒక శుభముహూర్తంలో భర్తృహరి రాజైనాడు. వరరుచి, భట్టి, విక్రమార్కుడు అందించే సహకారంతో భర్తృహరి జనరంజక పరిపాలన కొనసాగించాడు. చంద్రవర్ణుడు తృప్తిగా ప్రాణాలు విడిచాడు. ప్రజలు చంద్రవర్ణుని పరిపాలనలో వలే భర్తృహరి పరిపాలనలో కూడా హాయిగా ఉంటున్నారు. భర్తృహరి తనసోదరులకు ఈడు జోడు ఉన్న కన్యలను తెచ్చి వివాహాలు చేశాడు. తానుకూడా పెళ్ళిచేసుకొన్నాడు. ఏ సమస్యాలేని భర్తృహరి ప్రశాంతంగా రాజ్యపాలన చేస్తున్నాడు.

ఒకనాడు ఎక్కడినుంచో ఒకయోగి భర్తృహరి దగ్గరకు వచ్చాడు. అతణ్ణి దీవించి ఒక దానిమ్మ పండునిచ్చి "రాజా! ఇది దేవలోకంలో పండిన పండు. దీన్ని తింటే నీవు నిత్యం యవ్వనవంతుడై ఉంటావు, నీకు మరింత సుఖం లభిస్తుంది" అన్నాడు.

భర్తృహరి ఆ యోగికి నమస్కరించి ఆ పండును తీసుకొన్నాడు. తన భార్య యవ్వనం చెడకుండా ఉండాలని తనభార్యకు పండునిచ్చి తినమన్నాడు. ఆ మర్నాడు సాయంత్రం భర్తృహరి మేడపై పచార్లు చేస్తూ వీధిలోకి చూశాడు. తనగుఱ్ఱపు శాలలో పనిచేసే కాళి అనే ఆవిడ పోతున్నది. ఆమె తలపై ఒక గంప, ఆ గంపలో దానిమ్మపండు ఉన్నది. ఆశ్చర్యపోయిన భర్తృహరి కాళిని పిలిపించి ఆ పండు ఎక్కడిదని అడిగాడు. ఆమె రాజుకు భయపడి గుఱ్ఱాలను మేపే తన ప్రియుడు ఇచ్చాడని చెప్పింది. గుఱ్ఱాలను మేపేవాణ్ణి రాజు పిలిపించాడు. అతడు చెప్పిన విషయం వినగానే భర్తృహరికి మతిపోయింది. సాక్షాత్తు తన భార్యే అతనికి ఆ పండు నివ్వడంతో భర్తృహరికి చాలాకోపం వచ్చింది. అందర్నీ చంపేద్దామను కొన్నాడు. అంతపాపం ఎందుకు ఒడిగట్టుకోవాలని, వారికి కొంతధనం ఇచ్చి రాజ్యాన్ని విడిచి వెళ్ళిపోమ్మన్నాడు.

తన భార్యను గుఱ్ఱాలవానితో పంపిన తర్వాత భర్తృహరికి చాలా విరక్తి కలిగింది. ఈ వలపులు, ప్రేమలు అన్నీ వృథా అనిపించింది. స్త్రీలు మోసగత్తె లనుకొన్నాడు. మళ్ళీ సంసారం జోలికి వెళ్ళకూడదనుకొన్నాడు. వరరుచిని పిలిచి రాజ్యపాలన చేయమన్నాడు. వరరుచి అంగీకరించలేదు. విక్రమార్కుణ్ణి రాజును చేసి, భట్టిని అతనికి తోడుగా ఉండమన్నాడు. తాను అరణ్యానికి వెళ్ళిపోయాడు.

ఆలోచించగా, ఆలోచించగా భర్తృహరికి తనతండ్రిజీవితం తన జీవితం లోని సంఘటనలు నేర్పిన పాఠాలు, గుణపాఠాలు కళ్ళముందు కనిపించసాగాయి. ఒకరాజైన తనపరిస్థితే ఇలా ఉంటే సామాన్యుని గతి ఎలా ఉంటుందోనని భర్తృహరి దిగులుపడ్డాడు. మంచి చదువులేని వారు, దుర్మార్గులతో స్నేహంచేసి చెడి పోయేవారు, ధూర్త స్త్రీలను నమ్మేవారు, కామినులు పన్నిన వలలో చిక్కుకొనే వారు, ఆత్మాభిమానం లేనివారు, ధైర్యం లేనివారు, స్త్రీల అందచందాలు శాశ్వత మనుకొనేవారు, మూర్ఖులు ఎలా తమజీవితాలను అశాంతికి నెలవులుగా మార్చు కొంటున్నారో తలచుకొని భర్తృహరి బాధపడ్డాడు. ఈ బాధలకు రాజులు, మంత్రులు, ఉద్యోగులు, వ్యాపారులు, చదువుకొన్నవారు, చదువురానివారు ఎవరూ మినహా యింపు కాకపోవడం భర్తృహరికి ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

తనగురించి తాను ఆలోచించుకొనే స్థాయి నుంచి ఎదిగిన మనిషి, మహనీయు డవుతాడు. ప్రపంచంకోసం, పరోపకారంకోసం అతని మనసు

తపిస్తుంది. ఇప్పుడు భర్తృహరి పరిస్థితికూడా అదే, తాను అనుభవించిన జీవిత సారాన్ని రాబోయే తరాలవారికి అందించి వారి జీవితాలను సుఖమయం చేయాలను కొన్నాడు. ఆ సంకల్పంలో నుంచి పుట్టినవే భర్తృహరి సుభాషితాలు. సంస్కృతంలో 300 శ్లోకాలు నీతి, శృంగార, వైరాగ్య శతకాలుగా విభజించబడి ఉన్న భర్తృహరి సుభాషితాలను - వాటిసారాంశాన్ని తేటతెలుగు వచనంలో అందించడమే ఈరచన ఉద్దేశ్యం.

## నీతిశతకం - మూర్ఖపద్ధతి

మానవ సమాజ పురోగతికి నీతి ముఖ్యమైనది. నీతిలేని సమాజం అభివృద్ధి చెందదు. అక్కడి మనుష్యులకు శాంతి లభించదు. సుఖశాంతులతో జీవించడానికి నీతి రాజమార్గం, అందుకే భర్తృహరి నీతిని బోధించుచున్నాడు.

దేశకాలాలకు అతీతమైనది పరబ్రహ్మ స్వరూపము అది అనంతమైనది. జ్ఞానస్వరూపమైనది. దానిని స్వానుభవంతో తెలుసుకోవాలి. అది శాంతినిస్తుంది. జీవనమార్గంలో కాంతి నిస్తుంది. ఆ పరబ్రహ్మ స్వరూపానికి నమస్కారం. పెద్దల అనుభవాల ద్వారా ఏది మంచి, ఏది చెడు అని తెలుసుకొనడం నీతి. దీనికి స్వానుభవంతో సంబంధం లేదు.

నీతిని ఎవరికి బోధించాలి? తెలిసినవారు ఆసూయా పరులు, వారు వినరు, వారి మార్గం వీడరు, ప్రభువులు గర్వం గల్గిన వారు, నీతి చెప్పిన వారిని కూడా శిక్షించగలరు. ఇక సామాన్యులకు చెప్పినా అర్థంకాదు. అందుకే నీతిని చెప్పడం అంత సులభం కాదు. అది మహాత్ముల హృదయంలోనే అణిగిపోతూ ఉంటుంది. ఎవరెన్ని విధాలుగా భావించినా తెలిసిన వారు చెప్పవలసిందే, తెలియని వారు నేర్చుకోవాల్సిందే.

ఏమీ తెలియని వానికి చెప్పడం, వాణ్ణి ఒప్పించడం సులభం, అన్నీ తెలిసిన వానికి చెప్పడం మరీ సులభం. లోకంలో తెలిసీ తెలియని వారు కొందరుంటారు. వారు ఎవరు చెప్పినా అంగీకరించరు. వారికి తెలిసిందే పరమార్థమని అనుకొంటారు. అటువంటి వారికి బ్రహ్మ కూడా చెప్పలేడు. చెప్పడానికి ప్రయత్నించినా ఒప్పించలేడు. వానికి చెప్పడం కంటే మొసలి నోటిలో కోరల

మధ్యనున్న రత్నాన్ని వెలుపలికి తీయవచ్చు. పెద్ద పెద్ద అలలతో అల్లకల్లోలంగా ఉన్న సముద్రాన్ని దాటవచ్చు. బుసకొట్టి వస్తున్న పామును పూలదండవలే ధరించ వచ్చు.

అంతేకాదు, ప్రయత్నిస్తే ఇసుక నుండి నూనె తీయవచ్చు. దప్పిగొన్నప్పుడు ఎండమావులలో నైనా నీరు సంపాదించవచ్చు. ఎక్కడో ఒకచోట తిరిగి కుందేటి కొమ్మును తెచ్చుకోవచ్చు. కాని ఎంత ప్రయత్నించినా మూర్ఖుని మనస్సును మాత్రం సమాధాన పర్చలేము.

బాగా చదువుకొన్న పండితులు కొందరు తాము బాగా మాట్లాడగలమని, తియ్యనైన మాటలతో ఎంతటి మూర్ఖుణ్ణైనా మార్చగలమని భావిస్తూ ఉంటారు. అది వృథా ప్రయాస, తామర తూడులతో బలమైన ఏనుగును బంధించగలమా? కఠినమైన వజ్రాన్ని పూరేకుతో కోయగలమా? సముద్రంలో తేనె చుక్కలు కలిపి, దాన్ని తియ్యగా మార్చగలమా? మూర్ఖుణ్ణి మార్చడం కూడా అటువంటిదే.

మానవుడు కొంత తెలుసుకోగానే అతనిలో గర్వం ప్రవేశిస్తుంది. మంచివారు గర్వాన్ని దగ్గరకు చేరనీయరు. మూర్ఖులు గర్వాన్ని ఆలింగనం చేసుకొంటారు. మదపుటేనుగు వలే ఎవరినీ లెక్కచేయక తిరుగుతారు. పండితులతో కలిసినప్పుడు కొన్ని ఆశ్చర్యకరమైన క్రొత్త విషయాలు వింటారు. మెల్లమెల్లగా తమకు తెలిసింది. కొంతేనని వారికి అర్థమౌతుంది. అప్పటికి వారి విజ్ఞానమెంతో వారికే తెలుస్తుంది. గర్వం అణగిపోతుంది.

పండితులున్న సభలో మూర్ఖుడు మాట్లాడితే వాని అజ్ఞానం బయట పడుతుంది. బ్రతుకు అబాసు పాలౌతుంది. అటువంటి వారికోసం బ్రహ్మ మౌనమనే ఆభరణాన్ని సృష్టించాడు. ఇది మూర్ఖుని అధీనంలో ఉంటుంది. తెలిసిన వారి సమక్షంలో ఉన్న మూర్ఖుడు ఈ ఆభరణాన్ని ధరించి గౌరవాన్ని పొందవచ్చు.

నీచుడు తన స్వభావం, సంకుచితమైనదని గ్రహించడు. మూర్ఖుడు తన తెలివిమాలిన తనాన్ని ఒప్పుకోడు. అతడు కుక్క వంటి స్వభావం కలిగిన వాడు. కుక్క మాంసం లేని గాడిదఎముకను కొరుకుతూ ఉంటుంది. దాని నిండా పురుగులుంటాయి. కుళ్ళిన వాసన వస్తూఉంటుంది. రోత పుడుతూ ఉంటుంది.

అయినా వదలదు. అప్పుడు దాని దగ్గరకు ఇంద్రుడే వచ్చినా సిగ్గుపడదు. చేస్తున్న నీచపు పనిని మానదు. మూర్ఖుడు కూడా అంతే.

స్వర్గంలో ప్రవహించే గంగ శివుని తలపైకి దిగింది. అక్కడి నుండి హిమాలయాలకు, అక్కడినుండి నేలకు, నేల నుండి సముద్రానికి అక్కడినుండి పాతాళానికి దిగజారిపోయింది. తమ స్థాయిని వదలి క్రింది స్థాయికి వెళ్ళే వివేక హీనులు ఇదేవిధంగా దిగజారిపోతూ ఉంటారు. గౌరవాన్ని పోగొట్టుకొంటారు. తరచుగా ఇటువంటి పనులను మూర్ఖులే చేస్తుంటారు.

అగ్నిని నీటితో ఆర్పవచ్చు. గొడుగు పట్టుకొని ఎండనుండి రక్షించుకోవచ్చు. మదపుటేనుగును అంకుశంతో పొడిచి, గాడిద, ఎద్దు మొదలగు జంతువులను కర్రతో కొట్టి స్వాధీన పరచుకోవచ్చు. ఔషధాల ద్వారా, మంత్రాలద్వారా విషానికి విరుగుడు సాధించవచ్చు. వీటన్నిటికి శాస్త్రప్రమాణాలు కూడా ఉన్నాయి. కాని మూర్ఖుల మూర్ఖత్వాన్ని పోగొట్టడానికి మంత్రంగాని, ఔషధంగాని లేవు. ఏ శాస్త్రంలోనూ వాటి ప్రస్తావన లేదు. కావున మూర్ఖునికి దూరంగా ఉండాలి. వానితో వాదనకు దిగరాదు. ఆత్మపరిశీలన ద్వారా ప్రతిమనిషి తమలో అంశమాత్రంగా ఉన్న మూర్ఖత్వాన్ని పోగొట్టుకొని సుఖశాంతులతో జీవించాలి.

ఇలా మూర్ఖపద్ధతిని ముగించిన భర్తృహరి తరువాత విద్వాంసుడెలా ఉంటాడో తెలియజేయడానికి విద్వత్పద్ధతిని ప్రారంభిస్తున్నాడు.

## విద్వత్పద్ధతి

విద్య ద్వారా అజ్ఞానం పోతుంది. విద్యావంతులున్న సమాజం సుఖ శాంతులతో విలసిల్లుతుంది. విద్య నేర్చిన వారు. విద్యను నేర్పేవారు సమాజానికి ఉన్న ఉమ్మడి ఆస్తులలో అత్యుత్తమ ఆస్తిగా పరిగణింపబడతారు. విద్వాంసులను చేరదీయడం, గౌరవించడం ప్రభుత్వ బాధ్యత.

అనేక శాస్త్రాలను చదివి చక్కగా ఉపన్యసించి, శిష్యులకు శాస్త్రాలను బోధించు సామర్థ్యం గల పండితులు దరిద్రులుగా ఉండరాదు. అటువంటి వారిని గుర్తించి రాజువారికి ధన ధాన్యాలను సమర్పించాలి. నిర్ధనుడైన పండితుడుంటే ఆ ప్రభువు మూర్ఖుడని అర్థం. రత్నాలకు సంబంధించిన విజ్ఞానం లేని వ్యాపారి

వాటి ధరను తక్కువగా నిర్ణయిస్తాడు. అలా చేసినంత మాత్రాన ఆ రత్నాలకు లోపం రాదు కదా!

ఒక వ్యక్తి ధనం సంపాదించి పెడితే అది దోచుకొనేవానికి కనిపిస్తుంది. విద్య దొంగకు కనిపించదు, అందుకే రాజులకంటే పండితులే గొప్పవారు. రాజులు ఈవిషయంలో పట్టుదలకు పోరాదు. పండితుల వద్ద గల విద్యాధనం నిత్య సుఖాన్నిస్తుంది. అడిగిన వారికి ఇచ్చే కొద్దీ పెరుగుతూనే ఉంటుంది. ప్రళయ కాలంలో కూడా నాశనం కాదు. పండితులు రాజుల వద్ద నున్న ధనాన్ని గడ్డిపోచతో సమానంగా పరిగణిస్తారు. రాజులు సంపదలను ఆశచూపి పండితులను వశపరచుకోలేరు. అలా చేయగలిగితే మదపుటేనుగును తామరతూడుతో బంధించినట్లే.

బ్రహ్మకు హంసపై కోపం వస్తే దానిని తామరలున్న సరస్సులో విహరించ రాదని ఆదేశిస్తాడు. అంతేగాని హంసకు సహజ లక్షణమైన నీటినుండి పాలను వేరుచేసే గుణాన్ని, దానివల్ల కలిగిన కీర్తిని తీసుకోలేడు కదా! రాజుకు కోపం వస్తే పండితుణ్ణి ఉద్యోగం నుండి తీసివేయగలడు. కాని, అతని పాండిత్యాన్ని గ్రహించలేడు కదా! అందుకే పాండిత్యాన్ని పెంపొందించుకోవాలి.

పాండిత్యమే మనిషికి అలంకారం. ముత్యాల హారాలు, భుజకీర్తులు, స్నానం, గంధం మొదలగు విలేపనాలు, రకరకాలుగా అలంకరించబడిన వెంట్రుకలు – ఇవన్నీ అలంకారాలు కావు. ఎందుకంటే ఈ అలంకారాలన్నీ క్షీణించేవే. నశింపనిది శాస్త్రసంస్కారంగల వాక్కు అనగా పండితుని నోటి నుండి వెలువడే వ్యాకరణబద్ధమైన వాక్కులు నశింపని భూషణాలు.

ఈ పాండిత్యం అనగా విద్య మానవునికి రూపం. అది దాచి పెట్టుకొన్న ధనం. విద్య సకల భోగాలను కీర్తిని కలుగజేస్తుంది. పెద్దవాళ్ళ పెద్దరికం నిలబెట్టేది విద్యయే. ఈ చదువు విదేశాలకు వెళ్ళినపుడు బంధువుగా ఆదుకొంటుంది. విద్య మనముందు ప్రత్యక్షమైన భగవంతుడు. విద్యావంతుడు రాజులచేత గౌరవింప బడుతాడు. సన్మానాలకు కొదువ ఉండదు. ధనం ఇటువంటిది కాదు. ధనం అనేక కష్టాలకు కారణమౌతుంది. ధనం లేకుంటే నష్టం లేదు కాని, విద్యలేని వాడు మాత్రం పశువే.

విద్యను వశపరచుకొన్నవానికి ఇక సంపదలు ఎందుకు, మంచి కవిత్వమున్నచో రాజ్యం వల్ల ప్రయోజనమేమి? ఓర్పుగలిగిన వానికి కవచముతో పనిలేదు. కోపిష్టికి క్రొత్తగా శత్రువులక్కరలేదు. దాయాదులుంటే చాలు, నిప్పు ఉన్నట్లే, దుర్మార్గులుంటే పాములున్నట్లే. మంచి స్నేహితుడుంటే దివ్యమైన ఔషధాలు ఉన్నట్లే. యవ్వనవతికి సిగ్గు సౌందర్యాన్ని కలుగజేస్తుంది. సిగ్గు ఉంటే నగలు అక్కరలేదు. శబ్ద సామ్రాజ్యాన్ని వశపరచుకొన్న పండితరాజుకు భౌగోళిక సరిహద్దులు గల రాజ్యమెందుకు?

ఈ లోకం అందరినీ గౌరవించదు, బంధువులయందు దాక్షిణ్యం, సేవకుల పట్ల దయ, సజ్జనుల యెడ ప్రేమ కలిగిఉండాలి. దుర్జనులను దూరంగా ఉంచాలి. రాజులతో నీతిగా మెలగాలి. విద్వాంసులతో సూటిగా వ్యవహరించాలి. పెద్దలపట్ల ఓర్పును ప్రదర్శించాలి. శత్రువులకు వెన్నీయరాదు. స్త్రీలను చూసి చలించకూడదు. ఈ విద్యలన్నీ సాధనద్వారా వశపరచుకొన్న వారిని లోకం గౌరవిస్తుంది. వారిని సత్పురుషులు అంటారు. అటువంటి వారి సాంగత్యాన్ని సజ్జన సాంగత్యం అంటారు.

సజ్జన సాంగత్యం బుద్ధి మాంద్యాన్ని పోగొట్టుతుంది. సత్యమును అలవాటు చేయిస్తుంది. సమాజంలో గౌరవాన్నిస్తుంది. పాపపు పనులకు చేయనీయదు. అందువల్ల మనస్సు నిర్మలంగా ఉంటుంది. కీర్తిని దశదిశలా వ్యాపింప జేస్తుంది. సజ్జన సాంగత్యం వల్ల కొన్ని ప్రయోజనాలు మాత్రమే కలిగితే వాటిని చెప్పవచ్చు. సకల శుభాలకు సజ్జన సాంగత్యమే కారణం.

విద్య నేర్చుకొన్నవాడు పండితుడు. ఉత్తమ నడవడిక గల పండితుడు సిద్ధుడు. సజ్జన సాంగత్యంగల సిద్ధుడు – రససిద్ధుడు. రససిద్ధి కలిగిన సృజనకారుడు కవి, క్రాంతదర్శియైన కవి – కవీశ్వరుడు వారు రచించునవి ఉత్తమ కృతులు – ఆ ఉత్తమ కావ్యాల రచయితల కీర్తి అనే శరీరానికి జరామరణాల భయం లేదు. కవీశ్వరులు లోకాన్ని, కాలాన్ని, మృత్యువును జయిస్తారు.

## మానశౌర్య పద్ధతి

అభిమానధనుడైన మానవుని సమాజం గౌరవిస్తుంది. సమాజంలో గౌరవంగా బ్రతకాలనుకొనేవారు తమస్థాయిని మరచిపోరాదు. చిల్లర చేష్టలకు దూరంగా

ఉండాలి. తమ జీవన విధానాన్ని గాని, ప్రవర్తననుగాని పదేపదే మార్చుకోకూడదు. సమాజానికి ఆమోదయోగ్యమైన జీవన విధానాన్ని విధిగా కొనసాగించాలి. రాజీ పడకూడదు.

సింహానికి ఆహారం దొరకదు, ఆ కారణంచేత అది కృశించిపోతుంది. తీవ్రమైన అలసటకు లోనవుతుంది, అందువల్ల ఆరోగ్యం క్షీణించి, తేజోవిహీన మౌతుంది. ఇవేవీ కాదనుకొన్నా ముసలితనం వల్లనైనా బడలిక ఏర్పడుతుంది. ప్రాణభయం వెంటాడుతూ ఉంటుంది. ఇటువంటి దుర్భర పరిస్థితుల్లో కూడా సింహం గడ్డి తినదు. ఏనుగు కుంభస్థలాన్ని చీల్చి, అక్కడున్న మాంసాన్ని భుజించాలనే కోరుకొంటుంది. అభిమానానికి సింహం ప్రతీక. కారణాలేవో చూపడం, ఏవో ప్రలోభాలకు లొంగడం, జీవన విధానాన్ని ప్రక్కదారి పట్టించడం అభిమానవంతుల లక్షణం కాదు. అది నీచుల లక్షణం.

అటువంటి నీచులైన వారు కుక్కవలే నీచప్రవృత్తిని కలిగి ఉంటారు. కుక్కకు ఒక ఎముక దొరుకుతుంది. ఆ ఎముకపై మాంసం ఉండదు. కొద్దిపాటి నరం, క్రొవ్వు ఉన్న కారణంచేత దానికి మట్టి అంటుకొని ఉంటుంది. ఆ ఎముక వల్ల కుక్క ఆకలి తీరదు కాని, కుక్క ఆనందిస్తుంది, గంతులు వేస్తుంది. సింహమయితే తన సమీపంలో తిరుగాడుతున్న నక్కను కూడా చంపదు. వదలి చేస్తుంది. ఎదురు చూసి, వెదకి ఏనుగునే చంపుతుంది. ఎటువంటి కష్టాలు సంభవించినా మానవులు, వారి వారి స్థాయికి తగిన ఫలితాలు లభించాలని కోరుకొంటారు. అంటే అభిమాన వంతులు తమ స్థాయికి తగని, నీచమైన పనులు చేయరు. అందుకే సమాజంలో వారి గౌరవానికి లోటుండదు.

అభిమాన వంతులు గంభీరంగా ఉంటారు, ధైర్యంగా ఉంటారు. ఎలాంటి లేకి పనులూ చేయరు. హుందాగా ప్రవర్తిస్తారు. ఎవరైనా ఒక ముద్ద అన్నం పెడతారంటే కుక్క వారి ముందర నానావేషాలు వేస్తుంది. తోక ఆడిస్తుంది. క్రిందబడి నోరు వెళ్ళబెట్టి పొట్టను చూపుతుంది. కాలితో నేలను గోకుతుంది. ఇంతా చేస్తే దాని ముఖాన యజమాని నాలుగు మెతుకులు విదిలిస్తాడు. వీలైతే మెతుకులు వేసేముందు కఱ్ఱతో నాలుగు బాదినా బాదుతాడు. కాని ఏనుగు గంభీరంగా నిల్చుకొని ఇటూ అటూ చూస్తూ ఉంటుంది. దాని వాలకం చూడగానే యజమాని భయంతో, భక్తితో రకరకాల దాణా తీసుకెళ్ళి స్వయంగా అందిస్తాడు.

ఆరాటపడేవానికి అవమానాలు, అభిమానవంతునికి గౌరవం సమాజం నుండి లభిస్తాయి.

ఈ ప్రపంచం పరిణామ శీలమైనది. నిరంతరం మార్పుకు లోనవుతూ ఉంటుంది. మానవులు కూడా పరిణామానికి లోనవుతూనే ఉంటారు. పుట్టిన వారు పెరుగుతారు. పెరిగినవారు ముసలివారవుతారు. ముసలి వారైన వారు మరణిస్తారు. మరణించిన వారు మరల జన్మిస్తారు. ఇది చాలా సాధారణమైన విషయం. కాని ఎవడు పుట్టడం వల్ల వారి వంశం మిక్కిలి కీర్తిని పొందుతుందో వాని జన్మమే సార్థకమైనది. అనగా కీర్తిని సముపార్జించలేని జన్మ వ్యర్థం.

అభిమానవంతులకు రెండే మార్గాలుంటాయి. అవి రెండూ ఉత్తమ మయిన మార్గాలే, అభిమానవంతుడు ప్రజలందరిచేత కొనియాడబడి కీర్తివంతుడౌతాడు. అలా కాలేని పక్షంలో అజ్ఞాతంగా జీవితాన్ని ముగిస్తాడు. అభిమానవంతుడు పూలగుత్తి వంటివాడు, అవకాశం ఉంటే గుడికో, జడకో చేరుతుంది. లేదా తాను పుట్టిన కొమ్మ పాదాలపై వ్రాలి ఋణం తీర్చుకొంటుంది.

పూర్వం దేవదానవులు అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలికారు. అమృతం పుట్టింది. అది రాక్షసులకు దొరకకూడదని మోహినీరూపం ధరించిన విష్ణువు దేవతలతో ఆరంభించి అమృతాన్ని పంచడం ప్రారంభించాడు. రాహువు మారు వేషంతో దేవతల పంక్తిలో కూర్చొన్నాడు. ఈ విషయాన్ని సూర్యచంద్రులు విష్ణువుకు తెలియజేశారు. అప్పటికే అమృతం రాహువు కంఠం వరకు దిగింది. విష్ణువు చక్రాయుధాన్ని ప్రయోగించాడు. రాహువు తల మాత్రం బ్రతికిపోయింది. గ్రహ మండలంలో బృహస్పతి మొదలగు ఐదారుగురు దేవతలున్నారు. రాహువు వారి జోలికి వెళ్ళడు. వారితో విరోధించడు. తనకు తలమాత్రమే మిగిలిఉన్నా ప్రకాశ వంతులైన సూర్యచంద్రులనే బాధిస్తుంటాడు. అభిమానవంతుల చేష్టలు ఇలాగే ఉంటాయి. మడుగులో నుండి బయటకు వచ్చిన దుర్యోధనునితో ధర్మరాజు 'పాండవులలో ఒకరిని గెలిచి నీ రాజ్యం తీసుకో' అన్నాడు. దుర్యోధనుడు, నకులునితో గాని, సహదేవునితో గాని యుద్ధంచేసి ఉండవచ్చు, కాని అతడు అభిమానధనుడు, అందుకే తనకు సమఉజ్జీ అయిన, మొదటి నుండి తనకు పోటీగా నిలిచిన భీమునితోనే యుద్ధానికి పూనుకొన్నాడు.

సకల భూమండలాన్ని శేషుడు తన పడగలపై మోస్తున్నాడు. ఆ శేషుణ్ణి ఆదికూర్మం మోస్తున్నది. కూర్మాన్ని సముద్రం ఆదివరాహం కోరలపై ఉండేటట్లు చేస్తుంది. ధీరులైన వారి చరిత్రలు ఇలాగే ఉంటాయి. భూమండలాన్ని మోయడం సాధారణ విషయమా? శేషుని ధీరత్వం వల్ల అతనికిది సాధారణ విషయం, సాధ్య విషయం అయ్యింది. మహాత్ముల విభూతులు, ప్రభావాలు అవధులు లేనివిగా ఉంటాయి.

పూర్వం పర్వతాలకు ఱెక్కలు ఉండేవి. అందువల్ల పర్వతాలు విచ్చలవిడిగా సంచరించేవి. పర్వతాల సంచారం వలన సామాన్య జనుల జీవనానికి అనేక ఆటంకాలు జరిగేవి. చాలాసార్లు ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించేది. ఆ నష్టాన్ని నివారించడానికి ఇంద్రుడు పర్వతాల ఱెక్కలను నరికివేయాలనుకొన్నాడు. దధీచి మహర్షి వెన్నెముక నుండి పదునైన వజ్రాయుధాన్ని తయారు చేసుకొన్నాడు. పర్వతాల ఱెక్కలను నరకడం ప్రారంభించాడు.

దేవరాజైన ఇంద్రుడు, పర్వతరాజైన హిమవంతుని మీదికి వచ్చాడు. హిమవంతుని భార్యపేరు మేనాదేవి, అతని కుమారుడు మైనాకుడు, కుమార్తె పార్వతి, ఓషధీప్రస్థం అతని రాజధాని, ఇంద్రుడు గిరీంద్రుని ఱెక్కలు నరకడం ప్రారంభించాడు. శిలామయమైన ఱెక్కలపై, కఠినమైన వజ్రాయుధంతో నరుకుతూ ఉంటే ఆ రాపిడికి మంటలు పుట్టాయి. భయంకరమైన జ్వాలలు క్రక్కుతున్న వజ్రాయుధం దెబ్బలకు హిమవంతుడు స్పృహకోల్పోయాడు. ఆ సమయంలో హిమవంతుని కుమారుడైన మైనాకుడు తండ్రికోసం ఇంద్రుని ఎదురించలేదు. భయంతో పారిపోయి సముద్రంలో దాక్కున్నాడు. అంతకంటే తండ్రికోసం ప్రాణాలు విడవడం శ్రేయస్కరం కదా! మానశౌర్యం కలవారు ఎదురించి పోరాడుతారు. అదిలేని మైనాకుని వంటి పిరికివాళ్ళు పారిపోయి దాక్కుంటారు.

ప్రాణంలేని సూర్యకాంతశిలకూడా తనను సూర్యకిరణాలు తాకగానే మండుతుంది. ప్రాణమున్న మైనాకుని వంటివారు పారిపోవడం సబబేనా?అభిమాన వంతుడు శత్రువు ఎదిరిస్తే ప్రతిఘటిస్తాడు గాని, పారిపోడు.

అయితే, మైనాకుడు పసివాడు గదా? అంటారేమో, సింహం పిల్లను చూడండి. చెక్కిళ్ళలో మదజలం కారుతున్న మదపుటేనుగు ఎదురైనంత మాత్రాన

పారిపోతుందా? దానిమీదకు లంఘించదా? ఆకారం, వయస్సు, పరాక్రమానికి అడ్డుకట్టలు కావు. మైనాకుడు విజృంభించి ఉంటే ఇంద్రుడు వెనక్కి తగ్గే వాడేమో? ఇంతలో హిమవంతుడు పుంజుకొనే వాడేమో? అభిమానవంతునికి పిరికితనం పనికి రాదు. ఎదురించడానికి వయస్సు ఆటంకం కాదు. కాబట్టి తమస్థాయికి దిగజారి ఎవ్వరు బ్రతకవలసిన అవసరం లేదని భర్తృహరి మానశౌర్యపద్ధతి ద్వారా తెలియజేసి, తర్వాత అర్థపద్ధతికి ఉపక్రమిస్తున్నాడు.

## అర్థపద్ధతి

'ధనం మూలం ఇదమ్ జగత్' అన్నారు పెద్దలు. అందుకే మనుషుల్లో ధనాశ ఎక్కువ. ధనం కోసం దేన్నయినా వదులుకోవడానికి సిద్ధపడతారు. జాతిపోయినా చింతలేదు, గుణం పాతాళానికి పోయినా సరే, కులం కాలిపోనీ, శీలం కొండశిఖరం మీదనుంచి దూకనీ, మానవులు పట్టించుకోరు. ధనం ఉంటే చాలు, మిగిలిన గుణాలన్నీ గడ్డిపోచతో సమానమైనవిగా భావిస్తారు.

ఈలోకంలో ధనమున్నవాడే కులవంతుడు. ధనములేని తమ కులం వాణ్ణి మానవులు పట్టించుకోరు. పరాయికులం వాడైనా ధనవంతుడైతే అతణ్ణి ఆదరిస్తారు. ధనవంతుణ్ణి బుద్ధిశాలిగా పరిగణిస్తారు. అతణ్ణి నేర్పరిగా అంగీకరిస్తారు. అన్ని గుణాలు బంగారాన్ని ఆశ్రయించి ఉంటాయంటే ఇదే.

చెడ్డవాడైన మంత్రివలన రాజు నశిస్తాడు. సంయోగం వల్ల సన్యాసి, మితిమీరిన లాలన వల్ల పిల్లవాడు, దుర్మార్గుడైన కుమారుని వల్ల వంశం, చెడ్డవారి సహవాసం వలన శీలం, శాస్త్రాధ్యయనం చేయకపోవడం వలన బ్రాహ్మణుడు, గర్వం వల్ల స్నేహం, పర్యవేక్షణ లేకపోవడం వల్ల వ్యవసాయం, మద్యాన్ని సేవించుట వల్ల లజ్జ, చెడుబుద్ధివల్ల సంపదలు, అలసత్వం వల్ల ధనం నశిస్తాయి.

ఈ లోకంలో ధనానికి సంబంధించి మూడు మార్గాలున్నాయి. పాత్రత నెరిగి అనగా అర్హుడైన వానికి దానం చేయడం, అనుభవించడం, నశించడం, ఉత్తములైన వారి ధనం దానం చేయబడుతుంది. మధ్యముని చెంతనున్న ధనం అనుభవించబడుతుంది. నీచుడు తన ధనాన్ని దానం చేయడు. తానూ అనుభవించడు. చివరి కది నశిస్తుంది లేదా దోపిడీకి గురౌతుంది. అందుకే ధనాన్ని దానం చేయాలి.